ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 15 సెప్టెంబరు 2025

నేడు పరిష్కార వేదిక



పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 930 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణయ్యకు ఊంజల సేవ



స్వామివారికి ఊంజల సేవ నిర్వహిస్తున్న అర్చకులు, ఉయ్యాలలో కొలువుదీరిన స్వామివారు



కదిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీ కృష్ణస్వామి మందిరంలో ఆదివారం వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ఊంజల సేవ చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి విశేష, అస్థాన పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై కొలువుదీర్చారు. అర్చకులు ఊంజల సేవ చేశారు. సోమవారం సాయంత్రం ఉట్లమాను ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అలరించిన నాటిక

పుట్టపర్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సంగారెడ్డి జిల్లా భక్తులు ప్రదర్శించిన నాటిక భక్తులను అలరింపజేసింది. పర్తియాత్రలో భాగంగా రెండోరోజు ఆదివారం 'మృత్యోర్మా అమృతంగమయా' పేరిట నాటికను ప్రదర్శించారు. శతవర్షముల మహోత్సవం పేరిట భక్తిగీతాలు ఆలపించారు. భక్తిగీతాలు, నాటిక ద్వారా భక్తులను మైమరపింపజేశారు. సత్యసాయి పల్లకి సేవను నిర్వహించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

జిల్లా ప్రత్యేకతను కాపాడతా

శాంతిభద్రతలు, మహిళల సంరక్షణ, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

నూతన ఎస్పీ సతీష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ప్రత్యేకతను కాపాడేలా విధులు నిర్వర్తిస్తానని జిల్లా నూతన ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అర్బన్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం జిల్లాకు నియమించింది. ఆ మేరకు ఆయన ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలు, మహిళా సంరక్షణ, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్‌ను సందర్శిస్తానన్నారు. ఆయాప్రాంతాల్లో నేరాల వివరాలు తెలుసుకుని, వాటి నియంత్రణకు కార్యాచరణ రూపొందిస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంతకు మునుపు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఎస్పీకి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎస్పీ చాంబర్‌లో ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు చేపట్టారు.

దేవాలయం, మసీదు, చర్చి సందర్శన

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజున సతీష్‌కుమార్ ముందుగా జిల్లాకేంద్రంలోని దుర్గాదేవి ఆలయం చేరుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకులంలో ఉన్న మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కర్ణాటకనాగేపల్లి కింగ్స్ చర్చిలో మతపెద్దలతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

జ్వరగట్టు..!

మంచంపట్టిన దొడగట్ట..



జ్వరంతో బాధపడుతున్న గంగమ్మ

ఒకే ఇంటిలో మంచానపడ్డ వైష్ణవి, ఝాన్సీ, యశ్వంత్

పంచాయతీలో 50 మంది జ్వర పీడితులు

పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖాధికారులు

కర్ణాటకలో చికిత్స పొందుతున్న దుస్థితి

కలుషిత నీరే ప్రధాన కారణమా?

రొద్దం మండలంలోని దొడగట్ట పంచాయతీ మంచంపట్టింది. విష జ్వరాలతో వణికిపోతోంది. ఒకే ఇంట్లో ముగ్గురు, నలుగురు కూడా జ్వరాల బారిన పడ్డారు. దొడగట్ట హరిజనవాడలో ఒకే కుటుంబంలో వైష్ణవి, ఝాన్సీ, యశ్వంత్ ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. పంచాయతీలో ఏకంగా 50 మంది జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. అయినా.. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. జనం కర్ణాటకకు వెళ్లి ప్రైవేటు వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. రోజుల తరబడి చికిత్స పొందుతున్నా.. జ్వరం తగ్గట్లేదని వారు వాపోతున్నారు..



రొద్దం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగట్ట పంచాయతీ పరిధిలో 50మంది విషజ్వరాలతో మంచానపడ్డారు. దొడగట్ట గ్రామంలోని హరిజనవాడకు చెందిన 15మంది, రంగాపురం, వైటిరెడ్డిపల్లి గ్రామాల్లో 35 మంది వారం రోజులుగా విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అటువైపు రాకపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటకలోని వెంకటాపురం గ్రామానికి వెళ్లి, ప్రైవేటు వైద్యం చేయించుకుంటున్నారు. తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గుతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. మాజీ సర్పంచ్ భర్త జయప్పకు జ్వరం తీవ్రం కావడంతో హిందూపురానికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ఒకే పంచాయతీలో 50మంది..

దొడగట్ట గ్రామ పంచాయతీలోని రంగాపురం, వైటిరెడ్డిపల్లి 35, హరిజనవాడలో 15మంది జ్వరాలతో మంచానపడ్డారు. ఒకే కుటుంబంలో వైష్ణవి, ఝాన్సీ, యశ్వంత్, ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. గంగమ్మ నాలుగు రోజులుగా జ్వరంతో ఇంటికే పరిమితమైంది. హనుమంతరాయుడు, శ్రావ్య, ప్రణతి వారం రోజులుగా కర్ణాటకకు వెళ్లి వైద్యం పొందుతున్నారు. ఓబుళప్ప, హేమలత, మంజుల, అనిత, అశ్విని, నారాయణమ్మ తదితరులు జ్వరంతో బాధపడుతున్నామని వాపోయారు.

ఇలాగైతే జ్వరాలు రావా..?

దొడగట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా ఉన్న హరిజన వాడలో రోడ్డు పక్కనే డ్రైనేజీ కాలువలో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. మోటారు ఆఫ్ అయినపుడు డ్రైనేజీ నీరంతా పైపులోకి వెళ్తోంది. ఆ నీరు తాగడంతోనే జ్వరాలు ప్రబలినట్లు గ్రామస్థులు వాపోతున్నారు. హరిజనవాడలో రెండు చోట్ల మురుగునీరు నిలువ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. అందులో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించాలని గ్రామ సర్పంచ్‌ను కోరినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి, జ్వరాల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

ఆ ముగ్గురిదే రాజ్యం..!

ఏడీసీసీ బ్యాంకులో వైసీపీ మద్దతుదారుల హవా

చైర్మన్‌ను పక్కదోవ పట్టిస్తున్న వైనం

సీఈఓ నియామకానికి అడ్డంకులు



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (ఏడీసీసీబీ)లో ముగ్గురు అధికారులు ఆడిందే ఆటగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెత్తనం చలాయించిన అధికారులే కూటమిలోనూ హల్‌చల్ చేస్తున్నారు. పర్సన్ ఇన్‌చార్జిని తప్పిస్తూ.. ఏక సభ్యకమిటీ

(మిగతా 7లో..)

ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీ రత్నకు వీడ్కోలు పలుకుతున్న పోలీసు యంత్రాంగం

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న ఎస్పీ రత్నకు జిల్లా పోలీసు యంత్రాంగం ఆత్మీయ వీడ్కోలు పలికింది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నకు ఆదివారం నూతన ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. మొమెంటో అందజేశారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం మరువలేనిదన్నారు. ఇదే సహకారం నూతన ఎస్పీకి కూడా అందించాలని ఆమె సూచించారు. అనంతరం ఆమెను ఓపెన్‌టాప్ జీపుపై పూలవర్షం కురిపిస్తూ తాళ్లతో లాగి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణస్వామి, హేమంత్‌కుమార్, ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త జట్టు.. పాలనపై పట్టు..!

ప్రజల్లో సంతృప్తే లక్ష్యం

జిల్లాకు నూతన కలెక్టర్, ఎస్పీ నియామకం

పురోభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు





కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ విజయాల్లో కీలక పాత్ర పోషించేది కలెక్టర్. శాంతిభద్రతల పరిరక్షణ ఎస్పీ బాధ్యత. జిల్లా పురోభివృద్ధిలో ఈ ఇద్దరువు [illegible] సమన్వయంతో వారి వారి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంది. అప్పుడే ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి వెళ్లాయి. ప్రజలకు కూడా నమ్మకం ఏర్పడుతుంది. ఆ దిశగానే జిల్లాలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్న వాదనలు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాకు కొత్త కలెక్టర్, ఎస్పీని నియమించడం అందులో భాగమేనని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. కొత్త కలెక్టర్‌గా శామ్‌ప్రసాద్, ఎస్పీగా సతీష్ కుమార్‌ను ప్రభుత్వం నియమించడం ద్వారా జిల్లాకు కొత్త జట్టును ఇచ్చినట్లయింది. తద్వారా పాలనపై పట్టు సాధించే దిశగా చర్యలు తీసుకుంటోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గాడితప్పిన వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడిప్పుడే పట్టాలెక్కిస్తున్నారు. 15 నెలల పాలనలో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టి, ఉపాధి కల్పన కేంద్రంగా మార్చాలని సీఎం దృష్టి సారిస్తున్నారు.

కలెక్టరే కీలకం

అన్ని రంగాల్లో పురోగతి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ లక్ష్యాలను రూపొందించింది. ఆ దిశగా జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలతోపాటు పారిశ్రామికాభివృద్ధి, విద్య, వైద్యం, పర్యాటకం, సాగు, తాగునీరు తదితర అంశాల లక్ష్యాలపై జిల్లా యంత్రాగం ఇప్పటికే నివేదికలు సిద్ధం చేసింది. పారిశ్రామికాభివృద్ధి దిశగా భూముల సేకరణ, పారిశ్రామిక వాడల్లో సదుపాయాల కల్పన చర్యలు ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గానికి పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నారు. దానిని విజయవంతం చేసే దిశగా జిల్లా సమీక్షలు, ఔత్సాహికులను ప్రోత్సహించడంలో చొరవ చూపాల్సి ఉంది. పరిశ్రమలకు భూముల కేటాయింపు వేగవంతం చేయాల్సి ఉంది. జిల్లాను హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌తో అనుసంధానం చేసేలా ఆటో మొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అంశాల ప్రాణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. జిల్లాలో రాష్ట్ర, జాతీయ రహదారులు, ప్రభుత్వ అవసరాలకు భూసేకరణతోపాటు నిర్మాణ పనులు వేగవంతం చేయాల్సి ఉంది. ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతోపాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తి కలిగేలా జవాబుదారీతనం ఉండేలా అధికార యంత్రాంగం పని చేయాలి. జిల్లా కేంద్రం ఏర్పాటు చేసి మూడేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలు లేక పరాయి పంచనే పాలన సాగించాల్సి వస్తోంది. దీంతో పాలనపై పట్టులేక అభివృద్ధి వేగం మందగించింది. ఈనేపథ్యంలో జిల్లాను ప్రగతి బాట పట్టించడం ద్వారా తన మార్క్ చూపుతారని కొత్త కలెక్టర్‌పై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

ఎస్పీకి సవాళ్ల స్వాగతం

రాష్ట్రంలో ఏ జిల్లాకు లేనంత పొడవైన కర్ణాటక సరిహద్దు ఉంది. ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న జిల్లాలో చాపకింద నీరులా గంజాయి, పేకాట, మట్కా, జూదం విస్తరిస్తున్నాయి. అన్ని పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచే పాలన సాగిస్తున్న చందంగా ఉంది. పోలీసు నిఘా లేక వైసీపీ పాలన తరమాలోనే నేడూ పేకాట, మట్కా, గంజాయికి అడ్డుకట్ట పడట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రశాంతమైన జిల్లాలో ఇటీవల దోపిడీలు, చోరీలు, హత్యలు జరగడం కలకలం రేపుతోంది. సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రిపూట పెట్రోలింగ్, నేరచరితుల, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసు నిఘా సన్నగిల్లడంతో శాంతి భద్రతలపై పోలీసు శాఖ పట్టు తప్పుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నాకాబందీ, రాత్రిపూట గస్తీ ఊసేలేకుండా పోయింది. చుట్టపుచూపుగా వెళ్లి రావడమే తప్ప.. నిత్య గస్తీ గల్లంతైంది. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు లేకపోవడంతో కర్ణాటక నుంచి యథేచ్ఛగా అక్రమ మద్యం, గుట్కా జిల్లాలోకి వచ్చేస్తోంది. ఇసుక, రేషన్ బియ్యం, ఎర్రచందనం జిల్లా మీదుగా జోరుగా రవాణా అవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఘర్షణలు, హత్యల్లో అధిక శాతం మద్యం, గంజాయి మత్తులో జరిగినవే. రోడ్డు ప్రమాదాలు సైతం సాయంత్రం నుంచి రాత్రి పది గంటల మధ్యలోనే అధికంగా జరుగుతున్నాయి. రానున్నది ఎన్నికల కాలం కావడంతో శాంతిభద్రతల పరిరక్షణ కూడా కత్తి మీద సామే. ఇలా ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాలి. నిర్వీర్యమైన ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పునరుద్ధరించడం అంత ఈజీ కాదు. వీటన్నింటినీ ఎస్పీ సతీష్‌కుమార్ నెట్టుకు రావాల్సి ఉంది.



కాంచీపురం పట్టుచీరలను పరిశీలిస్తున్న కమిషనర్, ఏడీ, చేనేతలు

కాంచీపురంలో ధర్మవరం నేతన్నలు

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన నేతన్నలు తమిళనాడులోని కాంచీపురం మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌లో ఆదివారం రెండోరోజు పర్యటించారు. క్లస్టర్‌లో నూతన డిజైన్లు, చేనేతల నైపుణ్యాభివృద్ధి, అధునాతన పరికరాలు, మార్పులు, మార్కెటింగ్‌లో మెలకువలు తదితర విషయాలు తెలుసుకున్నారని చేనేత జౌళి శాఖ ఏడీ ఏడీ రామకృష్ణ తెలిపారు. నేతన్నలతోపాటు జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, గుంటూరు జిల్లా ఏడీ వనజ, డిజైనర్ నాగరాజు, 30 మంది చేనేత కార్మికులు పాల్గొన్నారు. రెండ్రోజుల పర్యటన ముగియడంతో ధర్మవరానికి తిరుగు ప్రయాణమయ్యారు.

నేడే డీఎస్సీ ఎంపిక జాబితా

19న అమరావతిలో నియామక పత్రాలు

అక్కడికి ప్రత్యేక బస్సుల్లో తరలింపు

కోర్టు కేసులతో టెన్షన్ 7

సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేటు పాఠశాలల సంఘం నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేత

కదిరి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు కోరారు. స్థానిక వాల్మీకి పాఠశాలలో ఆదివారం ఆ సంఘం జిల్లా మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గుర్తింపు సర్టిఫికెట్ల జారీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రవిచంద్రారెడ్డి, సింగారెడ్డి, వాల్మీకి అనిల్‌కుమార్ రెడ్డి, బ్లూమూన్ శివశంకర్, క్రిష్టారెడ్డి, క్రిష్ణమూర్తి, సాదిక్‌బాషా, సలీం బాషా, సురేష్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవేంద్ర, కిరణ్, జాహ్నవి, బాషా, నాయుడు, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
- ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర మహాసభలు

7

క్రైం కార్నర్

రాణినగర్‌లో వ్యక్తి హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?

అనంతపురం క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాణినగర్‌లో దారుణ హత్య చోటు చేసుకుంది. బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్లకు చెందిన చిన్న పెద్దన్న(50) హత్యకు గురైనట్లు అనంతపురం వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న పెద్దన్న కోళ్లు తరలించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నగరంలోని రాణినగర్‌లో ఉంటున్న అంజినమ్మతో అతడికి వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఆమెతో ఐదురోజుల కిందట గొడవ పడినట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం పొడరాళ్లలోని ఇంటి నుంచి వెళ్లిన అతడు.. ఆదివారం ఉదయం హత్యకు గురయ్యాడు. ఇంట్లో అతడిని కొట్టి చంపినట్లు తెలుస్తోంది. అంజినమ్మ, ఆమె కొడుకు రమేష్, మరికొందరు ఈ హత్య చేశారంటూ మృతుడి కొడుకు గోపాల్.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి హరి భార్య శిరీష(32) అనే మహిళ ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హరి రైల్వే డీజిల్ షెడ్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే స్థానికులు గమనించి భర్తకు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం రైల్వే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద ఎస్‌ఎల్‌వీ మద్యం దుకాణంలో ఆదివారం వేకువ జామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రంలోని గాంధీనగర్ వద్ద ఉన్న మద్యం దుకాణంలోకి ఇద్దరు దుండగలు ప్రవేశించి దుకాణంలో ఉన్న రూ. రూ.11వేల నగదు ఎత్తుకెళ్లినట్లు మద్యం షాపు యాజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. సీసీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకుని దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్టు

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసి వంకలో పూడ్చేసిన కేసులో భర్తతోపాటు మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సీకేపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలో భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. సరస్వతి వివాహేతర సంబంధం పెట్టుకుందనీ, ప్రవర్తన మార్చుకోవాలని సూచించాడు. ఎంత చెప్పినా ఆమె వినలేదు. దీంతో వెంకటరాముడు తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామాంజి, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజినమ్మ సహాయంతో సరస్వతిని చంపేసి నరసింహులు, విజయ్ సహాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చివేశాడు. సరస్వతి మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సరస్వతిని భర్త వెంకటరాముడు చంపినట్లు నిర్ధారణ అయింది. దీంతో వెంకటరాముడు, నరసింహులు, విజయ్‌ను ఆదివారం మేడాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుంతకల్లు-రాయచూరు సెక్షన్ తనిఖీ

గుంతకల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని గుంతకల్లు-రాయచూరు సెక్షన్‌ను డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదివారం తనిఖీ చేశారు. ఆయన ప్రత్యేక రైలులో గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్ స్టేషన్లను సందర్శించారు. అమృత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించరాదని, అత్యుత్తమ ప్రమాణాలతో ప్రయాణికులకు సౌకర్యాల మెరుగుపై దృష్టి సారించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు తెలియజేశారు. అనంతరం రైల్వే స్టేషన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఇంటర్లాకింగ్, భద్రతా ప్రొటోకాల్స్ విషయంలో స్టేషన్ ఆపరేటింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టిని నిలపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ రైల్వే శాఖల ఇన్‌చార్జులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

25 నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

గుత్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో గౌతమిపురి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 27 వరకు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్డీటీ, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నాయన్నారు. విన్నర్‌కు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 18లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9052653405, 9985678208, 9966560163 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలురలో తూర్పు.. బాలికల్లో గుంటూరు..

● బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి విజేతలుగా ఆవిర్భావం



బాలుర విజేత తూర్పుగోదావరి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మధుసూదన్ రెడ్డి

బత్తలపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు చాంపియన్లుగా అవతరించాయి. మండలంలోని రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగ ఫైనల్లో చిత్తూరుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు గెలుపొంది, విజేతగా అవతరించింది. బాలికల విభాగంలో విశాఖపట్నంపై గుంటూరు జట్టు గెలుపొంది, ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్లకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్యం పెంపొందుతాయన్నారు.

కార్యవర్గం ఎన్నిక



తిమ్మప్ప, అధ్యక్షుడు



సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి

అనంతపురంరూరల్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల బోధనేతర ఉద్యోగుల కార్యవర్గాన్ని ఆదివారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శిగా శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి చెందిన సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే యూనివర్సిటీకి చెందిన మనోకుమార్ సింగ్‌ను మీడియా కో ఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు. మరో 30 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

నేడే డీఎస్సీ ఎంపిక జాబితా

● 19న అమరావతిలో నియామక పత్రాలు
● అక్కడికి ప్రత్యేక బస్సుల్లో తరలింపు
● కోర్టు కేసులతో టెన్షన్



డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు (ఫైల్)

అనంతపురం విద్య, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్రశాఖ నుంచి 773 మంది అభ్యర్థులతో జిల్లా విద్యాశాఖకు ఎంపిక జాబితా రాగా.. ఇక్కడి జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ పరిశీలనకు పంపించారు. కొత్త ఎంపిక జాబితాకు ఆమోదం వేసినట్లు సమాచారం. సోమవారం జిల్లాలవారీగా తుది జాబితాలను ప్రకటిస్తారు. డీఎస్సీ వెబ్‌సైట్‌లో కూడా పెట్టనున్నారు. ఏడేళ్ల తర్వాత నిర్వహించిన డీఎస్సీ ఇదే. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం రోజున దీనిపైనే తొలిసంతకం చేశారు. టీచర్ల నియామకాల పట్ల నిరుద్యోగ అభ్యర్థులల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నియామకాల ప్రక్రియను పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఈనెల 19న అమరావతిలో ఒకేచోట రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ఆహ్వానించి సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ మేరకు రాష్ట్రశాఖ నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఎంపికైన అభ్యర్థులను ఈనెల 17వతేదీరాత్రి ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 18న అక్కడ కేటాయించిన ప్రదేశంలో వీరందరు రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుంది. 19న నియామకపత్రాలు అందజేస్తారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించి ప్లేస్‌మెంట్(పాఠశాల) కేటాయిస్తారు. ఒక అభ్యర్థి వారివెంట ఒక కుటుంబ సభ్యుడికి అమరావతికి వెళ్లడానికి అవకాశం ఇవ్వడంతో అనంత జిల్లాకు 37 బస్సులు అవసరమవుతాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది.

● **కోర్టు కేసులతో టెన్షన్**

డీఎస్సీ నియామకాల ప్రక్రియ ముగింపునకు చేరుకోగా.. కొందరు అభ్యర్థులు వివిధ సమస్యలతో కోర్టులకు వెళ్లారు. ప్రధానంగా కొందరు అభ్యర్థులు రెండు,మూడు సబ్జెక్టులకు ఎంపికయ్యారు. దరఖాస్తు సమయంలోనే ఏ పోస్టుకు ప్రాధాన్యం ఇస్తారో నమోదు చేయించుకున్నారు. కొందరు తొలుత ఎస్‌జీటీ, తర్వాత స్కూల్‌అసిస్టెంట్, ఇతర పోస్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ మేరకు ర్యాంకుల వారీగా ఆయా అభ్యర్థులకు పోస్టులు కేటాయించారు. దీంతో స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికైన అభ్యర్థులు తమకు ఎస్జీటీ కేటాయించడం అన్యాయమని, స్కూల్‌అసిస్టెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. దీనిపై అభ్యర్థుల వైపే న్యాయస్థానం మొగ్గు చూపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు పీఈటీలు, పీడీల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ప్రైవేట్ కాలేజీలలో చేరి అక్కడ క్లాస్‌లకు వెళ్లకుండా రెగ్యులర్‌గా కోర్సు పూర్తి చేసుకున్నట్లు సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ ఎంపిక జాబితా విడుదలపై సందిగ్ధత కొనసాగుతోంది.

తిరుపతిలో సందడి





తిరుపతి సదస్సులో పాల్గొన్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి

అనంతపురం క్రైం/శింగనమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సందడి చేశారు. ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ మహిళా సాధికార సదస్సులో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాప్తాడు, పుట్టపర్తి, శింగనమల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన
● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
● ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి



ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి



కోశాధికారి మద్దూరు నాగమణి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారమే అజెండాగా పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. కార్మికులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలపై ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో శనివారం నుంచి నిర్వహిస్తున్న యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఓబులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప విధానాలు మారడం లేదన్నారు. అదానీ, అంబానీ ఆస్తులు పెంచడానికి కార్పొరేట్ విధానం తీసుకొచ్చి విద్య, వైద్య రంగాల సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3వేలు మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కోతలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్మికులు 3 గంటలు మాత్రమే పనిచేస్తున్నారంటూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. కార్మికులకు రూ.15వేలు కనీస వేతనం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకోసం డిసెంబరులో కేంద్ర మంత్రుల నివాసాల వద్ద దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, నాయకులు క్రిష్ణమూర్తి, దయా రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మహాసభల్లో భాగంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దయా రమాదేవి, కోశాధికారిగా మద్దూరు నాగమణి, ఆఫీస్ బేరర్స్‌గా మహాలక్ష్మి, సుధారాణి, శాంత, మంగశ్రీ, వరలక్ష్మి, నాగవరలక్ష్మి, నాగమణి, సుప్రజ, సమ్మక్క, శివకుమారి, కల్పన, ఎస్‌కే రెహాన్, విజయమ్మలతో పాటు మరో 41 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

ఆ ముగ్గురిదే రాజ్యం..!

(5వ పేజీ తరువాయి)

చైర్మన్‌ను నియమించినా వాళ్లదే జరుగుతోంది. వైసీపీ కోవర్టులుగా ముద్ర వేసుకున్న అధికారులు చైర్మన్‌ను సైతం పక్కదోవ పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సంస్థను గాడిలో పెట్టాలని చైర్మన్ చేస్తున్న ప్రయత్నాలను సైతం ప్రభావితం చేసే విధంగా ఆ ముగ్గురు అధికారుల వ్యవహారతీరు కనబడుతోంది. ఏడీసీసీ బ్యాంకులో ఆ ముగ్గురు అధికారుల తీరుతో సంస్థకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది. నూతన చైర్మన్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆ ముగ్గురు ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి చేస్తున్న తిప్పలు అన్నీఇన్నీ కావు. ఉదయం లేచినప్పటి నుంచి చైర్మన్ చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకున్నారు. పలు నిర్ణయాల్లో చైర్మన్‌ను పక్కదోవ పట్టించే విధంగా వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. గతంలో బ్యాంకు సీఈఓలుగా పనిచేసిన ఆ ముగ్గురు అధికారులు తీరుపై సిబ్బందిలోనూ అసహనం కనిపిస్తోంది. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఒకే చోట అధికారులంతా పనిచేయాలనే నిబంధన ఉంది. వీరిలో ఓ అధికారి రెండో అంతస్తులో, మరొకరి మొదటి అంతస్తులో, ఇంకొకరు గ్రౌండ్‌ఫ్లోర్‌లో పనిచేస్తున్నారు. ఆ ముగ్గురిలో ఒకరిపై కళ్యాణదుర్గం బ్రాంచ్‌లో జరిగిన అవినీతి అక్రమాల్లో కీలకంగా ఉన్న మేనేజర్‌ను కాపాడడం, మరో అధికారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో అధికారిపై ఆత్మకూరు బ్రాంచ్‌లో నకిలీ పట్టాలకు రుణాలు చెల్లించిన కేసుల్లో ప్రధానంగా ఉన్నారు.


వైసీపీ హయాంలో బ్యాంకుకు తీవ్ర నష్టం

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో సహకార బ్యాంకులను, సహకార సొసైటీలను నిర్వీర్యం చేసింది. అధికారులు, ఉద్యోగులు ఒకే స్థానంలో అంటిపెట్టుకుపోవడంతో తమకు కేటాయించిన విధులు, లక్ష్యాలకు తూట్లు పొడిచారు. ఐదేళ్లలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోగా...నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో అనంతపురం బ్యాంకు చివరి స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా రూ.10వేల కోట్ల టర్నోవర్‌లో ఉండగా....అనంతపురం కేవలం రూ.1800 కోట్లు మాత్రమే టర్నోవర్ చేస్తోంది. తమ ఆధిపత్యం కోసం ఏడీసీసీ బ్యాంకులో ఉద్యోగులను వర్గాలుగా విభజించారు.

సీఈఓ నియామకానికి అడ్డంకులు

ఏడీసీసీ బ్యాంకుకు కొత్త సీఈఓ నియామకంపై ఆ ముగ్గురు అడ్డుపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏడీసీసీ బ్యాంకుకు కొత్త సీఈఓ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం-ఆప్కాబ్ గతేడాది నవంబరులో ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇంటర్వ్యూలను రద్దు చేసి ఈ ఏడాది జూన్ 29న మరోసారి ఆప్కాబ్ అధికారులు అనంతపురం నుంచి ఇంటర్వ్యూకు ప్రస్తుతం సీఈఓగా ఉన్న అధికారిణితో పాటు మరో ఇద్దరు అధికారులు హాజరయ్యారు. హాజరైన వారిలో ముగ్గురూ సీఈఓలుగా పనిచేశారు. ఒక అధికారి వచ్చే ఏడాది జూన్‌లో రిటైర్ కానునండడంతో తిరస్కరించారు. మరో అధికారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఉండడంతో ఆప్కాబ్ అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం ఎఫ్‌ఏసీగా పనిచేస్తున్న సీఈఓను ఎంపిక చేసి జాబితాలో పంపినట్లు సమాచారం. ఆ ముగ్గురూ చైర్మన్‌పై ఒత్తిడి చేసి నియామకానికి అడ్డంకులు సృష్టిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. నూతన చైర్మన్ బ్యాంకులో తన మార్కు చూపిస్తున్నారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో నకిలీ పట్టాలకు రుణాలు ఇచ్చిన ఘటనలో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసి, మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తాజాగా మరో ఏడుగురు అధికారులను బదిలీ చేశారు.

రాజకీయాలు చేస్తే సహించేది లేదు



గతంలో బ్యాంకులో ఏమి చేశారో నాకు అవసరం లేదు. ఇప్పుడు మాత్రం బ్యాంకులో రాజకీయాలు చేయాలని చూస్తే సహించేదిలేదు. గతంలో ఇష్టానుసారంగా రుణాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పుడు సొసైటీలను ఆన్‌లైన్ చేసి అర్హులైన రైతులందరికీ ఏడాది పొడవునా పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించాం. ఎవరు ఏమి చెప్పినా...నిజాయితీ, నిబద్ధతకే పట్టం కడతాం. సీఈఓ నియామకంలో ఆప్కాబ్ ఉత్తర్వులు, నిబంధనల ప్రకారం నడుచుకుంటాం. ఆప్కాబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థినే సీఈఓగా నియమిస్తారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదు.

-ముంటిమడుగు కేశవరెడ్డి, చైర్మన్, ఏడీసీసీ బ్యాంకు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ఉపాధ్యాయ సమస్యలపై రణభేరి: యూటీఎఫ్

అనంతపురంవిద్య, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రణభేరి జాతర చేపట్టినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నేతాజీ మున్సిపల్ స్కూల్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్కరణల పేరుతో ఉపాధ్యాయులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీచర్లను మానసికంగా వేధించడంతో పాటు పీఆర్సీలో తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని మండిపడ్డారు. వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, డీఏలు చెల్లించలేదని, పీఆర్సీపై మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. వీటి సాధన కోసం యూటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి జాతర చేపడుతోందన్నారు. సోమవారం కర్నూలు జిల్లాలో మొదలై మంగళవారం జిల్లాలోని గుంతకల్లులోకి ప్రవేశించి ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం చేరుకొని ఇక్కడ ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని నిరసన చేపడతామన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, నాయకులు రమణయ్య, రామప్ప, సరళ, రాఘవేంద్ర, ప్రమీల, సంజీవ్, సుబ్బరాయుడు, వెంకటేశులు, శివానంద పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

● కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



అర్ధాంతరంగా ఆగివ కళ్యాణ మండపాన్ని తిలకిస్తున్న జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్

లేపాక్షి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని కర్ణాటక హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన లేపాక్షిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని పరిశీలించారు. నాట్యమండపంలో తైలవర్ణాలతో తీర్చిదిద్దిన రామాయణ, మహాభారత చిత్రాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, దేవదాయశాఖ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

అపూర్వ కలయిక



హర్షం వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థుల

తాడిపత్రి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం తర్వాత మిత్రులందరూ ఒకచోటికి చేరారు. 1976-79 మధ్య కొడినహళ్లిలో చదివిన విద్యార్థులు ఆదివారం తాడిపత్రి పట్టణంలోని ఏపీఆర్ ప్యారడైజ్‌లో కలుసుకున్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న స్నేహితులందరూ ఒకేచోట కలిసి సమావేశం నిర్వహించుకున్నారు. వివిధ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్న వీరందరూ ఆరునెలల నుంచి ప్రయత్నించి ఒక దగ్గరకు చేరారు. ఇన్ని సంవత్సరాల తర్వాత అందరూ కలవడంతో వారి ఆనందానికి హద్దులు లేవు. కేరింతలు కొడుతూ ఒకరికొకరు కౌగిలించుకుంటూ పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, ఐఆర్‌ఎస్ రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయిముల్లా, అమరరాజా బ్యాటరీ సీఈఓ రమణ, జనరల్ మేనేజర్ గల్లా విజయనాయుడు, పారిశ్రామిక వేత్త శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షా కాలంలో గోజాతి, గేదె జాతి పశువులకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి అక్టోబరు 15వతేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా అనంత జిల్లాకు 3,20,500, సత్యసాయి జిల్లాకు 2,99,600 డోసులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. టీకాలు వేసిన పశువుల చెవులకు పోగులు వేసి, ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

న్యూస్ బాక్స్

రేపు అందుబాటులో మంత్రి

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈనెల 16న పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని బీజేపీ నియోజకవర్గ కార్యదర్శి హరీశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలహారాలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు, బొకేలు వంటి వాటిని తీసుకురావద్దని తెలిపారు. వాటికి బదులుగా నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, టవాళ్లు, బెడ్‌షీట్లు వంటి సామగ్రిని తీసుకురావాలని మంత్రి సూచించారని హరీశ్‌బాబు తెలిపారు. విద్యాభ్యాసం కొనసాగిస్తున్న అనాథపిల్లలకు అవి ఉపయుక్తమవుతాయని మంత్రి సూచించినట్లు తెలిపారు.

నేడు ప్రత్యేక సేవా కార్యక్రమాలు : మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు హరీశ్‌బాబు తెలిపారు. యువకులు, ప్రజలు, కార్యకర్తలు రక్తదానానికి పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఎస్పీని కలిసిన సామకోటి



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కుమార్‌ను టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆదివారం జిలా పోలీసు కార్యాలయంలో కలిశారు. ఎస్పీకి ఆయన సత్యసాయిబాబా చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌కు సన్మానం



ఏపీఐఐసీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ డైరెక్టర్‌గా నిడిగల్లు గ్రామానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్(బాబు)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. దీంతో లక్ష్మీ ప్రసాద్‌ను టీడీపీ మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ అనంతపురంలోని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. తాడిమర్రి మండల చరిత్రలో గతంలో ఎవరికీ లేనివిధంగా రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించడం విశేషమని వారు పేర్కొన్నారు. మండలంలోని పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కోసం కృషిచేయాలని వారు లక్ష్మీప్రసాద్‌ను కోరారు. లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ...తాడిమర్రి మండల అభివృద్ధి కోసం తప్పని సరిగా కృషిచేస్తానని పేర్కొన్నట్టు వారు తెలిపారు. నాయకులు చిల్లకొండయ్యపల్లి రమణ పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌కు...



మనోహర్‌నాయుడును సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కదిరి అర్బన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బండారు మనోహర్‌నాయుడును ఆదివారం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆయన నివాసంలో పూలమాలలు, దుశాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు కోయ సూర్యశేఖర్, బండారు గంగాధర్, దేరంగుల నారాయణ, చింతా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హరికుమార్

కదిరిఅర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ రాష్ట్ర జేఏసీ కార్యదర్శిగా పట్టణానికి చెందిన హరికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహ రావు నుంచి ఆదివారం నియామక పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ బాధ్యతలు అప్పగించిన నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'పేదలకు చూపు ప్రసాదించడమే లక్ష్యం'

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు కంటి చూపు ప్రసాదించడమే తమ లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణం, కార్యదర్శి విజయభాస్కర్ తెలిపారు. రోటరీక్లబ్, బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. చూపు మందగించిన 135 మందికి వైద్యచికిత్సలు నిర్వహించారు. ఇందులో 25మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు శివయ్య, సుదర్శనగుప్త, సత్రశాల ప్రసన్నకుమార్, రత్నశేఖర్‌రెడ్డి, మనోహర్‌గుప్త, జయచంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులరెడ్డి, శంకర కంటి ఆస్పత్రి పీఆర్‌ఓ శివప్రకాశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అల్లా బకాష్ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లకుంట్లపల్లి క్రాస్‌లో హైవే వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన బూదిలి అల్లా బకాష్ (50) అనే వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీకి చెందిన బీడి వ్యాపారి, ముతవల్లీ అయిన అల్లాబకాష్ తన కుమారుడు మహమ్మద్ ఆయాజ్‌తో కలిసి ద్విచక్రవాహనంలో బాగేపల్లికి వెళ్తున్నాడు. మామిళ్లకుంట్లపల్లి క్రాస్ హైవే వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అల్లాబకాష్, అతడి ఎనిమిది యేళ్ల కుమారుడు మహమ్మద్ ఆయాజ్‌ను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అల్లాబకాష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు ఆయాజ్‌కు చెయ్యి, కాలు విరిగిందని ఎస్ఐ తెలిపారు. భార్య మోబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామ దేవతలకు బోనాలు



ఎనుములవారిపల్లిలో జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ముదిగుబ్బ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేముల పంచాయతీ ఎనుములవారిపల్లి ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం గ్రామదేవతలకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామదేవతలైన గంగమ్మ, పెద్దమ్మ, నల్లలమ్మ, సప్పలమ్మ, ధూమమ్మ జ్యోతులు, బోనాలు నైవేద్యం పెట్టి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో వైభవంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. మహిళలు గ్రామదేవతలకు ఒడిబియ్యం, గాజులు, చీరలు, పూలదండలు, నిమ్మకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలకేంద్రమైన ఓబుళదేవర చెరువు, మండలంలోని ఆకుతోటపల్లి, గౌనిపల్లి ఎస్సీ కాలనీల్లో ఆదివారం గ్రామ దేవత గంగమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవారి విగ్రహాన్ని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.



ఓబుళదేవరచెరువులో...

ఆదమరిస్తే అంతే..!

● ఆసుపత్రి ప్రవేశ ద్వారంలో ఇనుపపైపుల వద్ద గుంత



పెద్దాసుపత్రి గేటులో ఇనుపపైపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదాలు జరిగినా, అనారోగ్యాలకు గురైనా హడావుడిగా ఆసుపత్రికి వెళుతుంటాం. అయితే ధర్మవరం పెద్దాసుపత్రి ప్రవేశ ద్వారంలో ఎదుట అమర్చిన ఇనుప పైపుల వద్ద పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. అడుగుపెడితే జారిపడి గుంతలోకి పడిపోయి... కాళ్లు, చేతులు విరిగే పరిస్థితి నెలకొంది. ఆసుపత్రికి పోయే రోగులు వామ్మో ఏమి ఇలా ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరపాటుగా అడుగు పెడితే ఇనుప పైపులపై జారి పడుతారు. ముందుభాగం కాంక్రీట్ లేకపోవడంతో రోడ్డుకు, పైపులకు మధ్య కాలు ఇరుక్కునే ప్రమాదం ఉందని హడలెత్తిపోతున్నారు. దీంతో వృద్ధులు మధ్యలో వెళ్లకుండా పక్కన ఉన్న గేట్లను పట్టుకుని జాగ్రత్తగా వెళుతున్నారు. ఎదురుగా ఎవరైనా వస్తే, వారు వెళ్లే వరకు ఆగి ముందుకు వెళుతన్నారు.. ఆసుపత్రి అధికారులు స్పందించి ఆసుపత్రిలోకి వచ్చే దారిలో ఉన్న ఇనుప పైపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ కార్యకర్త దౌర్జన్యం

● మరో ఇద్దరితో కలిసి వ్యక్తిపై దాడి

కొత్తచెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో అనిల్ కుమార్, నరేశ్ అనే ఇద్దరి మధ్య ఆదివారం సాయంత్రం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో గొడవ జరిగింది. మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బోయ అనిల్‌కుమార్ కాంట్రాక్టర్ పనులు చేస్తు న్నాడు. ఈ పనులకు మండల కేంద్రానికి చెందిన ముత్తు అలియాస్ నరేశ్, అతడి భార్య తాపీ మేస్త్రీ పనులకు మూడేళ్ల నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో అనిల్‌కుమార్, నరేశ్ మధ్య వ్యక్తిగత కారణాలతో గొడవ జరిగింది. అనిల్ కుమార్ తన బంధవులైన కిష్ట, నరసింహమూర్తితో కలిసి నరేశ్‌పై దాడి చేశాడు. దీంతో నరేశ్ తనకు న్యాయం చేయాలంటూ స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డగించి రక్షించారు. దీనిపై సీఐ మారుతీశంకర్‌ను వివరణ కోరగా వ్యక్తి గత కారణాలతో గొడవపడి దాడి చేసుకుని ఇరువురు ఫిర్యాదు చేశారన్నారు. నరేశ్ మద్యం మత్తులో స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, తాము కాపాడి మందలించామన్నారు. విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.



మారాల జడ్పీ హెచ్ఎస్‌లో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మిట్టపల్లి జడ్పీహెచ్ఎస్‌లో...

కన్నతల్లిని.. చదువుకున్న బడిని మరువరాదు

● పలువురు ఉపాధ్యాయుల ఉద్బోధ

బుక్కపట్నం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని... చదువుకున్న బడిని ఎన్నటికీ మరువరాదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని మారాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగితెలుసుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలిసి ఆనందంగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల భోజన వసతి కోసం షెడ్ నిర్మాణానికి రూ.65వేలు అంచనాతో శంకుస్థాపన చేశారు. దీంతో అప్పటి ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థులను అభినందించారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివిన విద్యార్థులు కలిశారు. అప్పటి ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగరాజరావు, కొండారెడ్డి, రామాంజనేయులును దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, గంగాద్రి, నీలోఫర్, బాలుబీ, పద్మావతమ్మ, మధుసూదన్‌రెడ్డి, రవూఫ్, బాలిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిప్పన్న, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

కదిరిఅర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అణచివేత ధోరణి అవలంభిస్తు న్నాయని విమర్శించారు. కార్మికులపట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న ధోరణిపై విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు సురేంద్రచౌదరి, అంజనేయులు, నాయకులు రాజేష్, మధునాయక్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముదిగుబ్బ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేముల గ్రామానికి చెందిన రక్షిదా అనే మహిళ ఆరేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి మలకవేముల క్రాస్‌కు చెందిన ప్రథమ చికిత్స వైద్యుడు అబ్దుల్ కరీం ద్వారా తెలుసుకున్న బెంగళూరులోని రుద్ర ఫౌండేషన్ వారు రూ.32వేలు అంద జేశారు. అంతేగాకుండా ఆమె కుమార్తె చదువుకు అయ్యే ఖర్చు భరిస్తామని తెలిపినట్లు అబ్దుల్ కరీం తెలిపారు. ఆ సొమ్మును ఆదివారం వారికి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు



మోటారు కాలిపోయిన తాగునీటి బోరు

గాండ్లపెంట, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కటారుపల్లి పంచాయతీ ద్వారణాల గ్రామంలో కాలిపోయిన తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నెలరోజుల క్రితం మోటారు కాలిపోవ గ్రామంలో తాగునీటికి తీవ్ర సమస్య ఏర్పడిందంటున్నారు.డంతో పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కు తెలిపినా, పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మండల కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీని ధర్మవరం డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వెంకటనాయుడు, ఉపాధ్యక్షుడిగా పూల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రఘు, గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ, కోశాధికారిగా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శులుగా సిద్ధయ్య, నరేష్, కమిటీ సభ్యులుగా శేఖర్, జయప్రకాష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేస్తామని తెలి పారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య, ప్రెస్‌క్లబ్ ఏర్పాటు, తదితర వాటిపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిలర్ జీవీ నారాయణ, జిల్లా నాయకులు ప్రసాద్, జయానందన్‌రెడ్డి, మదనాపు రామాంజినేయులు, గోల్డ్‌ప్రసాద్, పామాలనాగేంద్ర, డివిజన్ కమిటీ అధ్యక్షుడు జానపాటి మోహన్, ప్రధానకార్యదర్శి జాంపుల అజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా చిత్రావతి సుందరీకరణ పనులు



పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పరిధిలో చిత్రావతి సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో స్నానపు ఘట్టాలు, చిల్డ్రన్ పార్కు, చిత్రావతి సుందరీకరణ పనులు చేపడుతున్నారు. వాటిని కూటమి నాయకులతో కలసి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఇంజనీర్లకు సూచించారు. ఆయన వెంట నాయకులు రామాంజనేయులు, సాలక్కగారి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, రామారావు, కౌన్సిలర్ లక్ష్మీపతి, పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీరాంరెడ్డి, ముమ్మనేని వెంకటరాముడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్తాం

● హరినాథ్‌రెడ్డి, పశువైద్యాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తనకల్లు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశు గణాభివృద్ధికోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్నామని పశు వైద్యాధికారి హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పలు విషయాలు తెలియజేశారు.

ప్రశ్న: మండలంలో పశు సంపద ఎంత?

జవాబు: మండల వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, గేదె, జెర్సీ ఆవులు 11,800 ఉన్నాయి. గొర్రెలు, మేకలు 1,26,234 ఉన్నాయి. అలాగే మండలంలోని తవళం, బొంతలపల్లి, కొక్కంటి. పరాకువాండ్లపల్లి, కోటపల్లిల్లో ఐదు పశువైద్య కేంద్రాలున్నాయి.

ప్రశ్న: ప్రస్తుతం ఎలాంటి పథకాలు అమలవుతున్నాయి

జవాబు: మండల వ్యాప్తంగా ఐదు పశువైద్యకేంద్రాల్లో 75 శాతం సబ్సిడీతో మొక్కజొన్నలు, జొన్నలు రైతులకు అందజేసున్నాం. ఈ నెల 15నుంచి అక్టోబరు 10వరకు మండలంలోని పశువులన్నిటికి ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణకోసం టీకాలు వేయనున్నాం.

ప్రశ్న: ఉచిత ఇన్సూరెన్సు పథకం అమలులో ఉందా?

జవాబు: ప్రస్తుతం అమలులో లేదు, ప్రభుత్వం అనుమతులిస్తే పశువులకు ఉచిత ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తాం. అలాగే నేషనల్ లైవ్ టాక్ మిషన్‌కు సంబంధించి మండలానికి ఒక యూనిట్ కూడా మంజురుకాలేదు. అయినా ఈ విషయంపై ఔత్సహిక వ్యక్తులకు అవగాహన కల్పిస్తున్నాం.

గ్రంథాలయం అభివృద్ధికి కృషిచేస్తాం

● కమిటీ అధ్యక్షుడు చింతపులుసు పెద్దన్న



ఎంపికైన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని గ్రంథాలయ నూతన కమిటీ అధ్యక్షుడు చింతపులుసు పెద్దన్న పేర్కొన్నారు. ధర్మవరం శాఖ గ్రంథాలయ అభివృద్ధి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ ఆదేశాల మేరకు ఎంపికచేసినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా చింతపులుసు పెద్దన్న, ఉపాధ్యక్షుడిగా మేడా రవి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌నాయక్(ఎంఈఓ), సహాయకార్యదర్శిగా సుమన్ (బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం), సభ్యులుగా బండపల్లి రంగనాథ్, సుకుమార్, నాగరాజు, తిరుపాల్, ప్రదీప్, శ్రీనివాసరెడ్డి సురేంద్ర, ముకుంద, భరత్‌ను ఎంపికచేశారు. అనంతరం గాడిచర్ల హరి సర్వోత్తమరావు 143వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది రాము, రమణనాయక్, పాఠకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఓడీసీ విద్యార్థిని



శరణి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జ్ఞానసాయి విద్యానికేతన్ విద్యార్థిని శరణి ఎస్‌బీఎఫ్ఐ ఫెన్సింగ్ క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో శనివారం జరిగిన స్పోర్ట్స్ అకాడమీ ఉమ్మడి జిల్లా క్రీడల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న శరణి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె. క్రిష్ణమోహన్‌రెడ్డి, డైరెక్టర్ కీర్తన, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆదివారం అభినందించారు.

చెస్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారుడి ప్రతిభ



సహృద్‌కు సరిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బీఎస్‌కే అకాడమీ క్రీడాకారుడు ఎంపీ సహృద్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్టు అకాడమీ చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ తెలిపారు. నంద్యాల జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రాపిడ్, బ్లిట్స్ చెస్ పోటీలలో సహృద్ పాల్గొని రాపిడ్ విభాగంలో ఏడు రౌండ్లకు గాను ఆరు మ్యాచ్‌లలో 4వస్థానంలో విజయం సాధించి రూ.2వేలు నగదు బహుమతి పొందారన్నారు. అదేవిధంగా బ్లిట్స్ విభాగంలో ఏడు మ్యాచ్‌లకు గాను ఐదు మ్యాచ్‌లు ఆడి ఏడో స్థానంలో నిలిచి రూ.1000 నగదుతో పాటుమెడల్ కైవసం చేసుకున్నారని చీఫ్‌కోచ్ తెలిపారు.

న్యూస్ బాక్స్

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరే గౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామికి ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో అలంకరించారు. వచ్చిన భక్తాదులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

రొళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు స్థానిక వ్యవసాయ సహకార కార్యాలయంలో కేక్ కట్‌చేసి రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, కార్యదర్శి ఉగ్రేగౌడ్, పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్ర, యోగానంద్, హనుమంతనాయక్, బీజేపీ కన్వీనర్ బద్రీనాయక్, నారాయణప్ప, పాల్గొన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడికి..



శంకరప్పను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కిరికెర కో-ఆపరేటివ్ రైతు సహకార సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన మలుగూరు శంకరప్పను ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంవద్ద సత్కరించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్ హెచ్ఎన్ రాములు మాట్లాడుతూ రైతులకు సేవచేసే భాగ్యం ఆయనకు కల్పించారన్నారు. ఎమ్మెల్యే పీఏ వీరయ్య, రామకృష్ణారెడ్డి, హనుమంతరాయుడు, అంజి, రమేష్, పవన్‌కుమార్, సాయి, రామక్రిష్ణ, అంజినరెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఫ్రెండ్లీ బ్యాడ్మింటన్ టోర్నీ



ట్రోఫీలతో విజేత, రన్నరప్ జట్లు, కోచ్‌లు

గోరంట్ల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో గతనెల 22 నుంచి జరుగుతున్న ఫ్రెండ్లీ బ్యాడ్మింటన్ టోర్నమెంటు ఫైనల్ మ్యాచ్‌తో ఆదివారం ముగిసింది. ఆర్గనైజర్లు దామోదర్‌రెడ్డి, నాగరాజు, అశోక్, సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. అశోక్, వేమనారాయణ జట్టు, విజయ్, సిరాజుద్దీన్ జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సిరాజుద్దీన్, విజయ్ జట్టు 19/21 తేడాతో విజయం సాధించింది. టోర్నమెంటు స్పాన్సర్ తాడిపర్తి శంకర్ విన్నర్, రన్నరప్ కప్పులను విజేతలకు అందించారు. న్యాయనిర్ణేతలుగా సాలర్ ప్రసాద్ వ్యవహరించగా క్రీడాకారులకు సహకరించిన మిత్రులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17నుంచి నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గోరంట్లలో బీజేపీ నాయకులు ఆదివారం సేవా పక్షోత్సవాలపై సమీక్షించారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో 15రోజుల పాటు నిర్వహించే సేవా కార్యక్రమాలపై చర్చించారు. నాయకులు గంగాధర్, చలం, హరీష్, శ్రీనివాసులు, ముంతాజమ్మ, రామాంజినమ్మ, శంకర్ పాల్గొన్నారు.

డీఎస్ఎస్ బలోపేతానికి కృషి



డీఎస్ఎస్ పదాధికారుల ఎంపికలో పాల్గొన్న నాయకులు

పావగడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) బలోపేతానికి కృషి చేస్తామని తాలూకా కన్వీనర్ మధు తెలిపారు. సంఘం పదాధికారుల ఎంపికపై ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గురుమూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపికైన సందర్భంగా నాలుగు మండల కేంద్రాల్లో దళిత వాడలను చైతన్యవంతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతివారం సభ నిర్వహించి సమస్యలపై ఆరాతీస్తామన్నారు. వందలాది మంది నాయకులు పాల్గొన్నారు.

రొద్దం పోలీసు స్టేషన్‌కు వాహనం ఏదీ?

● సుదూర గ్రామాలకు చేరుకునేదెన్నడు?
● ఇబ్బంది పడుతున్న పోలీసులు



రొద్దం పోలీసు స్టేషన్

రొద్దం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా రొద్దం పోలీస్ స్టేషన్‌కు వాహనం లేకపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రొద్దం పోలీస్ స్టేషన్ పరిధిలో 19గ్రామ పంచాయతీలు, 63 గ్రామాలున్నాయి. పెద్దమండలం కావడంతో సరిహద్దు గ్రామాలైన శ్యాపురం, కంబాలపల్లి, రాచూరు, కె.మరువపల్లి, కలిపి, రంగాపురం, వైటీ రెడ్డిపల్లి, దొడగట్ట, డీఆర్ కొట్టాల గ్రామాలకు వెళ్లాలంటే 20 కి.మి. దూరం ఉంది. ఏదైనా గొడవలు, అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు పోలీసులు సమయానికి చేరుకోలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కోమారు రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకుని బాధితులను ఆస్పత్రులకు తరలించలేకపోతున్నారు. దీనికితోడు 108 వాహనాలు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులోకి రాకపోతే పోలీసు వాహనాల్లో బాధితులను తరలించి వైద్యం అందించే వీలుంటుంది. దీనికితోడు సుదూర గ్రామాలకు ద్విచక్రవాహనాల్లో పోలీసులు వెళ్లాలంటే రోడ్లుకూడా బాగాలేవు. ఇప్పటికైనా జిల్లా స్థాయి పోలీస్ అధికారులు రొద్దం పోలీస్‌స్టేషన్‌కు వాహన సౌకర్యం కల్పించాలని టీడీపీ నాయకులు, మండల వాసులు కోరుతున్నారు.

సాగునీటి చెరువులకు మరమ్మతులు

చిలమత్తూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి నీటి బొట్టు చెరువులకు చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మండల ఇరిగిషన్ అధికారి గౌతం నారాయణ తెలిపారు. ఆదివారం కోడూరు చెరువు కట్టకాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. ఆయకట్టు అధ్యక్షులతో సమావేశమయ్యారు. ప్రధానంగా చెరువులకు నీరు వచ్చే సప్లై చానల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వర్షపు



కాలువ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం



కోడూరు చెరువు కట్టకు ఇసుక మూటలు అడ్డువేస్తున్న కూలీలు

నీరు వృథాగా పోకుండా నేరుగా చెరువులోకి చేరుకునేలా చర్యలు చేపట్టామన్నారు. గత ఏడాది కురిసిన అధిక వర్షాలకు కట్టుకాలువలు దెబ్బతిన్నాయని, దాంతో ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడి నీరు వృథాగా పొలాల్లో పారాయన్నారు. పడిన గండ్లను గుర్తించి వాటిని పూడ్చే పనులు చేపట్టామన్నారు. కాలువల ద్వారా చెరువులకు సులభంగా నీరు చేరుకునేందుకు కంపచెట్లను తొలగిస్తున్నామన్నారు. కోడూరు, చిలమత్తూరు, పాతచామలపల్లి చెరువుల మరమతు పనులకు శ్రీకారం చుట్టామన్నారు.

కంటెయినర్‌ను ఢీకొన్న కారు

● నలుగురికి గాయాలు



కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

గోరంట్ల, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై బూదిలి క్రాస్ వద్ద కంటెయినర్‌ను కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురానికి చెందిన మరోహర్ కుటుంబం బెంగుళూరు వెళ్లి, ఆదివారం తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తుండగా కె హోటల్ సమీపంలో ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుకనుంచి ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో వాహన ఇంజన్ దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న మనోహర్, విజయలక్ష్మి దంపతులు, కుమార్తై శరణ ఆజిల్, మనవరాలు సిగ్నిత్ శరణా అజిత్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లి కియ పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయరహదారిపై ద్విచక్రవాహనాన్ని ఐచర్‌వాహనం ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు హరిప్రసాద్‌నాయక్ తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కియ పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని మక్కాజిపల్లి తండాకు చెందిన హరిప్రసాద్‌నాయక్ కియ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ద్విచక్రవాహనంలో పరిశ్రమకు వెళ్తుండగా అమ్మవారిపల్లి వైజంక్షన్‌లో యూటర్న్ తిరుగుతుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఐచర్‌వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హరిప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

రొద్దం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్. మరువపల్లి గ్రామానికి చెందిన బీకే సోమశేఖర్ మొక్కజొన్న చేనును కోయడానికి వెళ్లిన యంత్రం విద్యుత్‌పోల్‌కు వేలాడుతున్న డిష్‌వైరుకు తగలడంతో స్తంభం విరిగిపడింది. ఆదివారం సాయంత్రం రొద్దం మండలం ఆర్.మరువపల్లి గ్రామానికి చెందిన బీకే సోమశేఖర్, పెద్దగువ్వలపల్లి గ్రామానికి వెళ్లేదారిలో చెరువుపక్కన మొక్కజొన్న కోయడానికి ఎల్‌జీబీ బినగర్‌కు చెందిన మిషన్‌ను తీసుకెళ్లారు. రొద్దం నుంచి పెద్దగువ్వలపల్లికి వెళ్లే 11కేవీ విద్యుత్‌లైన్‌కు డిష్‌వైరు వేలాడుతోంది. ఆ దిశగా మొక్కజొన్న చేను కోసే యంత్రం డిష్‌వైరుకు తగిలి విద్యుత్ స్తంభం విరిగి కిందపడింది. యంత్రంలో ఉన్న డ్రైవర్, క్లీనర్ ఆ క్షణంలో ఉలిక్కిపడ్డారు. ఒక్కసారిగా విద్యుత్‌వైర్లు మిషన్ మీద పడకుండా పొలంలోకి పడటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి లైన్‌మెన్ రామప్ప చేరుకుని విద్యుత్ సరఫరా కావడంలేదని తెలుపడంతో మిషన్‌లోనే ఉన్న డ్రైవర్, క్లీనర్ ఊపిరి పీల్చుకుని కిందకు దిగారు. దీంతో పెద్దగువ్వలపల్లి గ్రామానికి రాత్రంతా విద్యుత్‌లేకుండా పోయింది. ఘటన జరిగిన ప్రదేశంలో 11కేవీ విద్యుత్‌వైర్లు కిందనే వేలాడుతున్నాయని మరమ్మతులు చర్యలు చేపట్టాలని మరువపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు



పిచ్చిమొక్కలతో నిండిన పాఠశాల ప్రాంగణం

పెనుకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయపేట ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కంపచెట్లు పిచ్చిమొక్కలు నిండుకుని పాములు, అడవి పందులకు ఆవాసంగా మారింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు వంద మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, కంపచెట్లతో అడవిని తలపిస్తోంది. ఇందులో పాములు, అడవి పందులు నివాసం ఏర్పరుచుకున్నాయి. వీటివల్ల విద్యార్థులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. తమ పిల్లలను బడికి పంపడానికే ఇష్టపడటం లేదు. పై అధికారులు వెంటనే స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీతోనే కురుబలకు న్యాయం



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

హిందూపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కురుబ కులస్థులకు వైసీపీలోనే న్యాయం జరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ అన్నారు. వైసీపీ కార్యాలయంలో రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శివ ఆధ్వర్యంలో కురుబ కులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇన్చార్జ్ దీపిక, గడ్డం రామక్రిష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని విధాలా సహకరించారన్నారు. ఎన్‌ఏ శివ, లేపాక్షి మల్లన్న, మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలపై టీడీపీ అసత్య ప్రచారం

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలపై టీడీపీ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంగణాన్ని పార్టీ కార్యకర్తలతో ఆమె సందర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పొగాకు రామచంద్ర, నరసింహ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో రసాయనాలు

- చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల విన్నపం



బహిరంగప్రదేశాల్లో వ్యర్థాలు వదులుతున్న వాహనం

హిందూపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని బ్రిటీష్ పెయింట్స్ పరిశ్రమలో రసాయన వ్యర్థాలను బహిరంగప్రదేశాల్లో వదులుతున్నారని ఆ గ్రామస్థులు అప్‌గ్రేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి పరిశ్రమ నుంచి రసాయన వ్యర్థాలను డ్రమ్ముల్లో తీసుకుని ఐచర్ వాహనంలో గ్రామ సమీపంలోని బహిరంగప్రదేశాల్లో వదులుతుండగా ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంతేకాక బహిరంగప్రదేశాల్లో వదులుతున్న వ్యర్థాల వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. ఈ వ్యర్థాలవల్ల భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

రక్తంతో రాసిన రాజ్యాంగమే దేశాన్ని శాసిస్తోంది

● బసవ రమానంద స్వామీజీ

పావగడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంటరానితనాన్ని రూపుమాపి, ఆకలి అవమానాలను భరిస్తూ భవిష్యత్తులో తనకు జరిగిన అన్యాయం సమాజంలో ఇలాంటి ఘటనలు జరగకూడదని అంబేడ్కర్ తన రక్తంతో రాసిన రాజ్యాంగమే నేడు దేశాన్ని శాసిస్తోందని వనకల్లు మఠం పీఠాధిపతి డాక్టర్ బసవ రమానంద స్వామీజీ అన్నారు. ఆదివారం యువసేన ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎల్సీ, పీయూసీలో 80 శాతంపైన మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థికి సమయస్ఫూర్తి, సమయజ్ఞానం, తల్లిదండ్రులకు గౌరవం, మొబైల్‌కు దూరంగా ఉండి విద్యపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం బెంగళూరుకు అంబేడ్కర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఐపీఎస్ అధికారి సత్యభామ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కంప్యూటర్ కాలంలో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ మూఢనమ్మకాలను పైదొలిగించుకోవాలని, మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, తమ ఆరాధ్య దైవమైన జుంజప్ప, కట్టప్ప అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో 94 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బెస్తరపల్లి కృష్ణమూర్తి, సిండికేట్ సభ్యుడు మోహన్‌కుమార్, సీడీపీఓ వినోద్‌రాజ్, పావగడ యాదవ సంఘం అధ్యక్షుడు నరసింహప్ప పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న స్వామీజీ, యాదవులు

ఎమ్మెల్యే హాజరుకాకపోవడం బాధాకరం: స్థానిక ఏఎస్‌కే సముదాయ భవనంలో ఆదివారం జరిగిన కాడుగొల్లల విద్యార్థుల ప్రతిభా పురస్కారానికి స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ హాజరు కాకపోవడం బాధాకరమని సంఘటన కార్యదర్శి నాగేష్, సన్న నాగప్ప, పదాధికారులు ఆరోపించారు. పట్టణంలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యార్థుల కార్యక్రమానికి హాజరు కాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి, నాయకులు

చెరువులకు చుక్క నీరు ఇవ్వని వైసీపీ

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్/గుడిబండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఒక్క చెరువుకు చుక్కనీరు ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి విమర్శించారు. ఆదివారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గుడిబండ మండలం బీటీ పల్లి గ్రామానికి చెందిన 40 కుంటుంబలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి పార్టీ కండువాలు వేసి గుండుమల సాదరంగా ఆహ్వానించారు. గత పాలనలో మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి పూర్తిగా నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి స్వలాభం చుసుకున్నారని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీలో చేరుతున్నాట్లు వైసీపీ నాయకులు తెలిపారు. అనంతరం గుండుమల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ దసరాకు కొత్తగా ఆటోడ్రైవర్లకు రూ.15 వేలు అందించే కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీ.టీ..పల్లికి చెందిన హనుమతేగౌడ్, రంగస్వామి, గోవిందప్ప, ప్రసన్నకుమార్, భోజరాజు, హరీష్, ఆనందప్పతో పాటు 40 కుటుంబలు టీడీపీలో చేరాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, తిప్పేస్వామి, నగర పంచాయతీ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు గుర్తింపు



ప్రజలకు అభివాదం చేస్తున్న లక్ష్మీనారాయణ

మడకశిర రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని పలువురు నాయకులు అన్నారు. మెళవాయి పంచాయతీకి చెందిన లక్ష్మీనారాయణ టీడీపీ రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ప్రజలు, నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. గ్రామంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిరవ్వహించారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు. మెళవాయి, సిద్దిగిరి, జెక్కపల్లి. గుడ్డంపల్లి, యూ రంగాపురం గ్రామాలకు చెందిన నాయకులు, కార్యక్తలు ఉత్సాహంతో సంబరాల్లో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపు అన్నారు. లక్ష్మీనారాయణ టీడీపీలో సామాన్య కార్యకర్తగా ఉంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేయడంతో ఈ స్థాయికి ఎదిగారన్నారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ నియమించడంతో తమ గ్రామస్థులు, కార్యకర్తలు ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారాలోకేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి కోసం పాట్లు

● పట్టించుకోని అధికారులు
● ఇబ్బంది పడుతున్న ప్రశాంతి నగర్ వాసులు



తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్న కాలనీవాసులు

పరిగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రశాంతినగర్‌కు వాసులు గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపినా, పంచాయతీ కార్యదర్శికి వినతులు అందించినా తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తున్నారేతప్ప శాశ్వత పరిష్కారం చూపడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కాలనీవాసులు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. పంచాయతీ బోరుకు మోటారు చెడిపోయి వారం రోజులు గడుస్తున్నా ఏ అధికారి పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.